## ప్రజలను లూటీ చేయడానికే గ్యాస్, డీజిల్ ధరల పెంపు

ముషీరాబాద్, ఏప్రిల్ 9: గ్యాస్, డీజిల్ ధరలు పెంపు ప్రజలను లూటీ చేయడానికే అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికే జీఎస్టీ వసూళ్ల పేరుతో ప్రజల జేబులు గుల్ల చేస్తున్న కేంద్రం ధర పెంపుతో మోయలేని భారం మోపుతుందన్నారు. ధరలు పెంపుతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదని, అసంఘటిత కార్మికులు, పేద ప్రజలు కేంద్రం చర్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశార. మోదీ పాలన అంటే మోసం.. మోసాల మాయమని, కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రేపు తెలంగాణ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్యే తలసానికి బైసాఖీ ఉత్సవాల ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న గురుద్వారా కమిటీ ప్రతినిధులు

## బైసాఖీ వేడుకలకు రావాలని తలసానికి ఆహ్వానం

అమీర్పేట్ ఏప్రిల్ 9: అమీర్‌పేట గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే 326వ బైసాఖీ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ గురుద్వారా కమిటీ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 13న జరిగే ఈ వేడుకలకు నగరం నలుమూలల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా సిక్కు సోదరులు పెద్దసంఖ్యలో హాజరుకానున్నారు. ఎమ్మెల్యే తలసానిని కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి తోపాటు గురుద్వారా ప్రబంధక్ కమిటీ అమీర్‌పేట్ అధ్యక్షులు సర్దార్ దర్శన్ సింగ్, ఉపాధ్యక్షులు సర్దార్ లాహోర్ సింగ్, సర్దార్ కుశ్వంత్ సింగ్‌లతోపాటు కమిటీ ప్రతినిధులు జోగేంద్ర సింగ్, చన్నీ సింగ్, సర్దార్ దేవేందర్ సింగ్, సర్దార్ రాజేందర్ సింగ్, సర్దార్ దర్శన్ సింగ్, సర్దార్ పెషవర్ సింగ్ తదితరులున్నారు.



## ఎమ్మెల్యే పద్మారావును కలిసిన భద్రాచలం నేతలు

సికింద్రాబాద్, ఏప్రిల్ 9: భద్రాచలానికి చెందిన స్థానిక యువజన సంఘం ప్రతినిధులు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారామ చంద్రస్వామి దేవాలయం తలంబ్రాలు, ప్రసాదాన్ని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్‌కు బుధవారం అందించారు. సికింద్రాబాద్ కారాబస్తీలోని ఆయన నివాసంలో కలుసుకొని కల్యాణ తలంబ్రాలు, ప్రసాదాలను అందించారు.

ఎమ్మెల్యే పద్మారావును కలిసి సన్మానిస్తున్న భద్రాచలం నాయకులు

## కంటోన్మెంట్ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

**బోర్డ్ సీఈఓ మధుకర్ నాయక్‌కు బోర్డు మాజీ సభ్యుల వినతి**



కంటోన్మెంట్ బోర్డు సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బోర్డుమాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి,మాజీ సభ్యులు

బొల్లారం, ఏప్రిల్ 9: కంటోన్మెంట్ బోర్డు యాక్ట్ 2006 ప్రకారం బోర్డు ఎన్నికలు నిర్వహించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులతో కలిసి బుధవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..గత ఐదేండ్లుగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని, పరిపాలన విభాగం సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎనిమిదో వార్డు పరిధిలోని రిసాల బజార్ డాక్టర్ అంబేద్కర్ సామాజిక భవనం పూర్తి కాలేదని, పేద ప్రజలకు శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా త్వరగా పూర్తిస్థాయిలో నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా ఆరో వార్డు రామన్న కుంట చెరువును ప్రక్షాళన చేయాలని, మూడు, నాలుగు, ఏడవ వార్డుల్లో దివంగత ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య నందిత హయాంలో మంజూరు చేసిన సామాజిక భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాల్సిందిగా కోరారు. కంటోన్మెంట్ వ్యాప్తంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు వర్క్ ఆర్డర్లు విడుదల చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు అసౌకర్యం లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, లోకనాథ్, శ్యాం కుమార్, నలిని కిరణ్, బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్ పాల్గొన్నారు.

## మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలి

**సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్‌నాయక్ డిమాండ్**



ధర్నాలో మాట్లాడుతున్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్

కవాడిగూడ, ఏప్రిల్ 9 : రాష్ట్ర వ్యాప్తంగా లంబాడీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని సేవాలాల్ బంజార సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలో లంబాడీలకు చోటు కల్పించకపోవడం అంటే లంబాడీలను విస్మరించడమేనని ఆయన ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే నిర్ణయం తీసుకోకపోతే గురువారం ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. లంబాడీ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ లంబాడీ లడాయి పేరుతో సేవాలాల్ బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష, వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. అగ్రకులాలకు మాత్రమే రాజకీయ అవకాశాలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీ సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లంబాడీలు లక్షల సంఖ్యలో ఓట్లను కలిగి ఉన్నారని, గెలుపు ఓటములను ప్రభావితం చేయగలిగిన సత్తా లంబాడీలకు ఉందన్నారు. లంబాడీ సామాజిక వర్గానికి విద్య, ఉద్యోగ రంగాల్లో భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల లెస్టీ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. లేనట్లయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసి ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, సేవాలాల్ బంజారా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చందూలలాల్ నాయక్, ఓయూ జేఏసీ నాయకులు రవీంద్ర నాయక్‌లతోపాటు లంబాడీలు పెద్ద సంఖ్యలో పాల్గన్నారు.



తిరుమలగిరి మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మైనార్టీ కార్పొరేషన్ల అధికారులతో మాట్లాడుతున్న సికింద్రాబాద్ ఆర్డీవో సాయికుమార్

## రాజీవ్ యువ వికాస్‌కు అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలి

**సికింద్రాబాద్ ఆర్డీఓ సాయికుమార్**

బొల్లారం, ఏప్రిల్ 9: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సికింద్రాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి సాయికుమార్ సూచించారు. బుధవారం తిరుమలగిరి మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మెప్మా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటోన్మెంట్లో వార్డుల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుమలగిరి మండల పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఇప్పటివరకు 1290 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు కేవలం 300 దరఖాస్తులు మాత్రమే మండల కార్యాలయానికి చేరుకున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించి వారికి సమాచారం అందిస్తున్నామని, వీలైనంత త్వరగా వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో గాని తిరుమలగిరి మండల కార్యాలయంలో గాని దరఖాస్తులు సమర్పించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు చెందిన ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హారిక, స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి శరత్, భానుచందర్, జూనియర్ అసిస్టెంట్లు సునీల్, శైలజ, శ్రావణి, వినయ్, మెప్మా అధికారి ప్రకాశ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ మృతి బాధాకరం



సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, ఏప్రిల్ 9: పార్టీ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పాల్గొనే సత్యనారాయణ మృతి చాలా బాధాకరం అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం బేగంపేటలోని చీకోటి గార్డెన్‌లోని వారి నివాసానికి వెళ్లి సత్యనారాయణ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు నరేందర్‌రావు, శేఖర్, ఆరీఫ్, ఆకుల హరికృష్ణ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- వరంగల్ సభకు ప్రతిఒక్కరూ తరలిరావాలి
- వాడవాడలో గులాబీ జెండా ఎగురవేయాలి
- కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి



కంటోన్మెంట్, ఏప్రిల్ 9: వరంగల్‌లో ఈనెల 27వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సభ విజయవంతంలో బస్తీ, వార్డు స్థాయి నాయకులు బాధ్యత తీసుకోవాలని కోరారు. సభకు బయలుదేరే రోజున ఉదయం నియోజకవర్గంలోని ప్రతిబస్తీలో గులాబీ జెండా ఎగురవేసి డప్పులతో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. వారం రోజుల్లో బస్తీల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రణాళికలు తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగం విని బస్తీల్లో ప్రజలకు తెలియజేయాలని చెప్పారు.

**హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం**

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కేవలం 15 నెలల పాలనలో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుందని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలతోపాటు ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టిందన్నారు. రైతు భరోసా లేక రూ.2 లక్షల రుణమాఫీ కాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా తులం బంగారం ఇస్తామని చెప్పిన సీఎం మాట మార్చారని, బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన డబ్బులు వస్తున్నాయన్నారు. ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

## వివాహాలు కుదర్చడంలో మధ్యవర్తులదే కీలకం

చిక్కడపల్లి, ఏప్రిల్ 9: వివాహాలు కుదర్చడంలో కీలక పాత్ర పోషించేది మధ్యవర్తులని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీఎంబీఏ జేఏసీ )చైర్మన్ బీఎం అర్జున్‌రావు అన్నారు. తెలంగాణ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ జేఏసీ ప్రమాణస్వీకారోత్సవం బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంఖ్యా శాస్త్రాన్ని నిపుణులు దైవజ్ఞ శర్మ చేతులమీదుగా బీఎం అర్జున్‌రావు చైర్మన్ ప్రెసిడెంట్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఉపాధ్యక్షుయ కార్యదర్శి పదవులు పొందిన యాదగిరిరెడ్డి, శోభారాణి, మహమ్మద్ సలీం, యోహాన, కొండస్వామి, దయానంద్, రామచందర్,శత్రుఘ్న, అనిల్,ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అర్జున్ రావు, వివిధ సంఘాలు ప్రతినిధులు రంజిత రెడ్డి,భూపాల్ రెడ్డి, రాజు నాయుడు,శ్రీదేవి, విద్య సాగర్, కొండస్వామి, యోహాను తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి సంస్థలో అక్రమాలపై విచారణ ముమ్మరం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ స్త్రీ నిధి సంస్థలు జరిగిన అక్రమాలు, అవినీతిపై జరుగుతున్న విచారణను ముమ్మరం చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్(టీఎస్ఏ)రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. స్త్రీనిధి సంస్థలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వారిని లక్ష్యంగా చేసుకొని టార్చర్, ట్రాన్స్ఫర్, టర్మినేషన్, కెరీర్ అడ్వాన్స్మెంట్లలో వివక్షతతో అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఉద్యోగులకు సరైన సౌకర్యాలు లేవని, టాక్సిక్ వర్క్ కల్చర్ ఉండటంతో 350పై చిలుకు ఉద్యోగులు రాజీనామాలు చేశారని గుర్తు చేశారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి సిబ్బందికి న్యాయం చేయాలని కోరామని చెప్పారు. స్త్రీనిధిలో జరిగిన అవకతవకలు, అవినీతిపై విచారణ జరపాలని ఆమె గతేడాది సెప్టెంబర్ 13న ఆదేశించారని పేర్కొన్నారు. ఈ విచారణను పక్కన పెట్టి ఎండీగా విద్యాసాగర్‌రెడ్డికి మళ్లీ రెన్యువల్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అక్రమంగా తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోకుండా గత రెండేండ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ నిబంధనల ప్రకారం రూ.350 కోట్ల టర్నోవర్ ఉన్న ప్రభుత్వరంగ సంస్థలకు కచ్చితంగా ఐఏఎస్ అధికారే మేనేజింగ్ డైరెక్టర్/వైస్ చైర్మన్‌గా ఉండాలన్నారు. ముందుగా ఆయన చేసిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సొసైటీలుగా ఉన్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లను విలీనం చేస్తూ ఆదేశాలు జారీచేసినందున, స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్యను కూడా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర సహకార బ్యాంకులో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు అక్రమంగా తొలగించిన 350 మందికి పైగా ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. స్త్రీ నిధి సంస్థను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అభిప్రాయపడ్డారు. దీనికోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, కుల సంఘాలు, యువజన సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్ యాదవ్

## 17వేల మంది పోలీసులతో బందోబస్తు



చిక్కడపల్లి, ఏప్రిల్ 9: ఈనెల 12న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న శోభాయాత్రకు 17వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, అశోక్‌నగర్ శోభాయాత్ర సాగే ప్రాంతాన్ని నగర పోలీసు కమిషనర్ సీవీ.ఆనంద్, చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్ ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్ కలిసి పరిశీలించారు.

## కార్మికుడి కుటుంబానికి ఉద్యోగుల చేయూత



తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 9 : హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గత కొన్నేళ్లుగా కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న దాసు (51) ఇటీవల గుండెపోటుతో మరణించాడు. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి కాంట్రాక్ట్ కార్మికులు, సింగరేణి అధికారులు, ఉద్యోగులంతా కలిసి రూ. 90 వేలను సేకరించారు. ఈ మొత్తాన్ని బుధవా రం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్. డీఎం సుభానీ ఉద్యోగుల సమక్షంలో దాసు కుటుంబసభ్యులకు అందజేశారు. ఉద్యోగులు అందించిన సహకారంపై దాసు కుటుంబీకులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యవసాయాన్ని గాడిలో పెట్టేది ఏఈఓలే..

- వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎ.కోదండరెడ్డి తదితరులు

రవీంద్రభారతి,ఏప్రిల్ 9 : వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు, నూతన వరవడిన తీసుకువచ్చేది వ్యవసాయ విస్తరణాధికారులేనని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్యవేదిక(టి-వావ్) తొలి డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకువచ్చేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు కృషి చేయాలన్నారు. నిత్యం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైనట్లే, నూతన మార్పులను తీసుకువరావాలని సూచించారు. వైద్యులు విధంగా రోగికి ఎలా చికిత్స చేస్తారో.. వ్యవసాయ విస్తరణాధికారులు పంటలకు సోకిన తెగుళ్లకు చికిత్స చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని గాడిన పెట్టేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. టీ-వావ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ బాదావత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీ-వావ్ సెక్రటరీ కళ్యాణి, పలువురు వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

## బీసీ బిల్లుకు బీజేపీ మద్దతు తెలుపాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుండ్ర కుమారస్వామి, తదితరులు

కాచిగూడ, ఏప్రిల్ 9: పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను తెలంగాణలో తిరగనివ్వమని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రకుమారస్వామి హెచ్చరించారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు విద్య,ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో పాస్ చేసిన రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్లో బీజేపీ ఎంపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. రాజకీయాలకి అతీతంగా పార్లమెంటులో బీసీ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో 70 కోట్ల మంది బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు బీసీ దళ్ కార్యకర్తలు ఉన్నారు.

## 18 నుంచి చైత్ర చంద్రిక అభినయంపై వర్క్‌షాపు




చైత్ర చంద్రిక అభినయ వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జి.వసుంధర, సమితి అధ్యక్షులు వి.విజయకుమార్

చిక్కడపల్లి, ఏప్రిల్ 9: సుప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ నవ్యనాటక సమితి నిర్వహణలో 'చైత్ర చంద్రిక' అభినయంపై ఒక ప్రత్యేక శిక్షణా శిబిరం(వర్క్‌షాప్) ఏప్రిల్ 18 నుంచి 20వ తేదీ వరకు మూడురోజులు ప్రఖ్యాత నర్తకీమణి, 'పద్మభూషణ్' విదుషి స్వప్నసుందరి(ఢిల్లీ) ఆధ్వర్యంలో నిర్వహింపబడుతుందని సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్తలు నిష్టల సుధామాల, మధుమతి కులకర్ణి తెలిపారు. ఈ కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను బుధవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకులు జి.వసుంధర, సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. నృత్య గురువులు డాక్టర్ ఇందిరా హేమ, సంజయ్‌కుమార్ జోషి, కళారత్న పురస్కార గ్రహీత మాధవీమాల పాల్గొన్నారు.

## 'కాచిగూడ శ్మశానవాటికను అభివృద్ధి పరచండి'

కాచిగూడ, ఏప్రిల్ 9: కాచిగూడ, హర్రస్‌పెంటలోని శ్మశానవాటిక అభివృద్ధిని జీహెచ్ఎంసీ అధికారులు విస్మరిస్తున్నారని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని 292 శ్మశానవాటికల్లో అతిపెద్దదైన అంబర్‌పేట శ్మశానవాటికలో అధికారుల నిర్లక్ష్యం తో అభివృద్ధి జరగడంలేదని ఆరోపించారు. శ్మశానవాటికను ఆనుకొని ఉన్న మూసి నాలా చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వస్తున్నదని,దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. శ్మశానవాటిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో నిర్మించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట రాజ్‌కుమార్‌విగ్, సాయిగిరిధర్, కృష్ణగౌడ్, నందకిశోర్ యాదవ్, విజయ్‌కుమార్, రతన్ ఉన్నారు.

## వాసవిలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన



మెహదీపట్నం ఏప్రిల్ 9 : యువత మత్తుకు బానిస కావద్దని, డ్రగ్స్‌ను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రిటైర్డ్ ఐపీఎస్ సందీప్ శాండిల్య అన్నారు. బుధవా రం గోల్కొండ ఇబ్రహీంబాద్ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో టీజీ యాంటీ నార్కొటిక్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సందీప్ శాండిల్య మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ డ్రగ్స్ అమ్మకాలు జరిగినా వెంటనే విద్యార్థులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌ను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఓడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కేంద్ర మంత్రి అలె నరేంద్రకు ఘన నివాళి



మాజీ కేంద్రమంత్రి ఆలయ నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, ఏప్రిల్ 9: మాజీ కేంద్ర మంత్రి టైగర్ అలె నరేంద్ర వర్ధంతి కార్యక్రమం బుధవారం గాంధీనగర్‌లో నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ హాజరై నరేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాధన పోరాటంలో కీలక పాత్ర పోషించారని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎ.వినయ్‌కుమార్, నాయకులు వి.నవీన్‌కుమార్, శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేశ్, సత్తి రెడ్డి, ప్రకాశ్ యాదవ్, అశోక్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సురేశ్, లక్ష్మణ్ యాదవ్, దోనేటి సత్యం, డి.కుమార్, రహమత్ అలీ, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.